

తెలంగాణ భవన్‌లో బుధవారం భారతరత్న డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్సీలు ప్రభాకర్ , బసవరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గట్టు రామచంద్రరావు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అసెంబ్లీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బండా ప్రకాశ్ తదితరులు



# కౌన్ బనేగా మినిస్టర్

- గ్రేటర్‌లో హస్తానికి దక్కని ప్రాతినిధ్యం
- అధికార పార్టీకి ఈ పరిస్థితి ఇదే మొదటిసారి
- నగరం నుంచి మంత్రివర్గంలో బెర్త్‌పై రాజకీయ ఉత్కంఠ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రిమండలి... సాధారణంగా ప్రతి జిల్లాకు అందులో బెర్త్ ఉంటుంది. అందులో రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌కు అయితే సముచిత ప్రాధాన్యత ఉంటుంది. కానీ నేడు కొలువుదీరనున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో... మంత్రివర్గంలో గ్రేటర్ నుంచి ప్రాతినిధ్యం ఉంటుందా? అనేది రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో మెరుగైన సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం కనీసం ఒక్కటంటే ఒక్క నియోజకవర్గంలోనూ ప్రాతినిధ్యం లభించలేదు. దీంతో ఎవరికైనా ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పిస్తారా? లేదా గ్రేటర్‌కు స్థానం ఇవ్వకుండానే మంత్రివర్గాన్ని నింపుతారా? అనేది రాజకీయ ఉత్కంఠకు కారణమవుతుంది. కాగా అధికార పార్టీకి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అసలు ప్రాతినిధ్యం లేకపోవడమనేది బహుశా ఇదే మొదటిసారిగా రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రం నుంచి నిన్నటివరకు కొలువుదీరిన ప్రతి ప్రభుత్వంలోనూ గ్రేటర్ హైదరాబాద్‌కు కీలక ప్రాధాన్యత ఉంటుందనేది రాజకీయ సత్యం. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పార్టీకి కనీసం ఒకటో, రెండు సీట్లతో రాజధాని ప్రాంతంలో ప్రాతినిధ్యం ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, టీడీపీలే కావడంతో కచ్చితంగా ఆ రెండు పార్టీలకు ప్రతిసారి కొన్ని స్థానాల్లో ఇక్కడ ప్రాతినిధ్యం దొరికేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సికింద్రాబాద్, మల్కాజిగిరి... రెండు స్థానాల్లో విజయం సాధించింది. 2018 ఎన్నికల్లో ఏకంగా పద్నాలుగు స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయ బావుటా ఎగురవేసింది. దీంతో ఈ రెండు సమయాల్లోనూ ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో పాటు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చి మరీ మంత్రివర్గంలో స్థానం కల్పించిన సందర్భాలు ఉన్నాయి. కానీ మొదటిసారిగా తాజా ఎన్నికల్లో అధికార పార్టీకి గ్రేటర్ పరిధిలో ప్రాతినిధ్యం లేకపోవడం గమనార్హం. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. చివరకు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ సైతం ముషీరాబాద్ నుంచి గెలవలేదు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇతర ముఖ్య నాయకులు కూడా గ్రేటర్ పరిధిలో గెలవలేదు.

## సమీకరణాల్లో గ్రేటర్ పాత్ర ఎలా?

సాధారణంగా రాష్ట్ర మంత్రివర్గంలో అన్ని ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం కల్పించేందుకు ఆయా అధికార పార్టీల సమీకరణాలు ఉంటాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో కనీసం ప్రతి ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురికి ప్రాతినిధ్యం ఉండేలా మంత్రివర్గ కూర్పు ఉంటుంది. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికల ఫలితాల్లో అన్ని జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ నుంచి మాత్రం లేదు. దీంతో దీనిని ఎలా భర్తీ చేస్తారనే దానిపై గడిచిన మూడు, నాలుగు రోజులుగా రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతుంది. సాంకేతిక వెసులుబాటు ప్రకారం... ఎమ్మెల్యేగా గెలుపొందని వారిని మంత్రివర్గంలోకి తీసుకున్నట్లయితే ఆరు నెలల్లో ఏదో ఒక స్థానం నుంచి ప్రాతినిధ్యం సాధించాలి. లేకపోతే శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించాల్సి ఉంటుంది. గతంలోని సంప్రదాయం ప్రకారం కచ్చితంగా ఎమ్మెల్సీగానే అవకాశం కల్పిస్తారు. అయితే ఈ అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ప్రస్తుతం రాజకీయ ఉత్కంఠను రేపుతుంది. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు ఈ అవకాశం ఇస్తారా? కొత్త పేరును తెరపైకి తెస్తారా? అనేది ఒకటీ, రెండు రోజుల్లో తేలనుంది.



# ఐటీ కారిడార్‌లో ఆటవిడుపు

- ఆధ్యాత్మికత ఒకవైపు.. ఆధునికత మరో వైపు
- నగర వాసులను ఆకట్టుకుంటున్న ఖాజాగూడ హిల్స్
- కొండపై నుంచి కొత్త అందాలు
- వారసత్వ ప్రదేశంగా గుర్తింపు

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్ ఆధునికతకు నెలవుగా మారింది. అభివృద్ధి చెందుతున్న ఐటీ కారిడార్‌లోని ఆయా ప్రాంతాల రూపురేఖలు శరవేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా ఉన్న శివారు ప్రాంతాలు ఊహించని స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయి. దానికి అనుగుణంగా ఓఆర్‌ఆర్ నుంచి నూతనంగా కల్పిస్తున్న మౌలిక వసతులతో కొత్త ప్రాంతాలకు అనుసంధానం చేస్తున్నారు. తాజాగా ల్యాంకోహిల్స్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు వేసిన లింకు రోడ్డుతో ఖాజాగూడ హిల్స్‌కు ప్రాధాన్యత వచ్చింది. వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఖాజాగూడ హిల్స్ ఐటీ కారిడార్‌లో ఆధునిక ఆటవిడుపు కేంద్రంగా మారింది. ఎత్తయిన కొండలు, దానిపై విశాలమైన మైదానం.

ఒక పక్కన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం, మరోచోట సాధువైన మెహర్ బాబా ధ్యానం చేసిన ఒక గుహ... ఇలా అన్నీ కలిసి ఉన్న ఖాజాగూడ హిల్స్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి పడమర భాగమంతా ఎత్తయిన కొండలు, గుట్టలతో కూడుకున్న ప్రాంతాలు ఉన్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నుంచి మొదలు కొని దుర్గం చెరువు, రాయదుర్గం, ఖాజాగూడ, మణికొండ ల్యాంకోహిల్స్, కోకాపేట, మంచిరేవుల, గండిపేట ప్రాంతాల్లో ఎక్కువగా కొండలతో కూడిన భూ భాగమే ఉంది. ఐటీ కంపెనీల రాకతో ఈ ప్రాంతాల రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. గుట్టలు, కొండలను చీల్చుతూ విశాలమైన రోడ్డు మార్గాలను నిర్మించారు. దీంతో అతి తక్కువ సమయంలోనే ల్యాంకోహిల్స్ ఎదురుగా ఉన్న ఖాజాగూడ హిల్స్‌కు ఎంతో గుర్తింపు వచ్చింది. నిత్యం నగర వాసులు వందలాది మంది ఇక్కడి గుట్టపై నుంచి ఐటీ కారిడార్‌లో కనిపిస్తున్న ఆకాశ హర్మ్యాలను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



### సరదాగా పర్వతారోహణం..

హైదరాబాద్‌కు చెందిన సేవ్ రాక్ సొసైటీ సభ్యులు కొందరు ఈ గుట్టపై సరదాగా పర్వతారోహణం చేయడానికి అప్పుడప్పుడు వస్తుంటారు. ఇక్కడి రాతి సంపద గురించి ప్రచారం చేస్తూ, దాన్ని పరిరక్షించాలంటూ సందర్శకులు వివరిస్తూ ఉంటారు. అత్యంత ఎత్తయిన కొండ ప్రాంతం కావడంతో కొంత మంది కేవలం ప్రకృతిని ఆస్వాదించడానికి వస్తుంటారు. చాలా పెద్ద బండ రాళ్లను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తుంటే రాక్ సొసైటీ సభ్యులు అడ్డుకొని, వాటిని పరిరక్షించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అలా ఖాజాగూడ కొండపై ఉన్న బండరాళ్లను రక్షిస్తూ పర్యాటక ప్రదేశంగా ఉండేందుకు సేవ్ రాక్ సొసైటీ బృందం కృషి చేస్తోంది.

### పర్యాటక క్షేత్రంగా గుర్తింపు..

ఐటీ కారిడార్‌లోనే అత్యంత ఎత్తయిన గుట్ట ప్రాంతంగా గుర్తింపు పొందింది. వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన ఈ గుట్టను హెచ్‌ఎండీఏ ప్రత్యేకంగా నిధులు వెచ్చించి పలు మౌలిక వసతులు కల్పించింది. ఫక్రుద్దీన్ గుట్టగా ప్రసిద్ధి చెందిన ఖాజాగూడ గుట్టపై ఉన్న రాతి సంపదను పరిరక్షించే చర్యలను చేపట్టింది. రాక్ సొసైటీ ప్రతినిధులు సైతం ఈ ప్రాంతాన్ని తరచూ సందర్శిస్తూ నగరంలోనే ఈ గుట్టపై ఉన్న సహజ సిద్ధమైన రాతి నిర్మాణాల గురించి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ కొండ పైకి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో సందర్శకుల తాకిడి తక్కువగా ఉండేది. హెచ్‌ఎండీఏ చేపట్టిన పరిరక్షణ చర్యలతో ల్యాంక్‌హిల్స్ నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెళ్లే మార్గం నుంచి వచ్చేందుకు దారిని ఏర్పాటు చేయగా, ఇటీవల కాలంలో ల్యాంకోహిల్స్ ఓఆర్‌ఆర్ వరకు వేసిన లింకు రోడ్డు 39తో విశాలమైన రహదారి గుట్ట పక్క నుంచే వచ్చింది. దీంతో ఖాజాగూడ గుట్ట నిత్యం సందర్శకులతో సందడిగా మారుతోంది. మరో ప్రత్యేక ఆకర్షణగా గుట్ట పై చూడగానే పెద్ద చెరువు నిండుగా నీటిని కనిపిస్తుండటం అక్కడి వారిని ఆకట్టుకుంటోంది. అక్కడ చూస్తే భారీ ఎత్తయిన బహుళ అంతస్థుల భవనాలకు తోడు 4,6, వరసలతో కూడిన రోడ్డు, ఓఆర్‌ఆర్ చుట్టూ కొత్తగా జరుగుతున్న నిర్మాణాలు చూపరులను ఆకట్టుకునేలా చేస్తోంది. గుట్టపై ఉన్న 800 ఏళ్ల నాటి పురాతన ఆలయమైన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని కొందరు సందర్శిస్తుంటే.. మరికొందరు అక్కడే ఉన్న సాధువైన మెహర్ బాబా ధ్యానం చేసిన ఒక గుహను సైతం సందర్శిస్తూ దాని ప్రత్యేకతలను తెలుసుకుంటున్నారు. చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఖాజాగూడ గుట్ట ప్రాంతం పర్యాటక ప్రదేశంగా గుర్తింపు దక్కించుకుంటోంది.